క్లుప్తంగా

ఎంపీ బాలశౌరి తనయుడు అనుదీప్ ఆస్తి రూ.63.55 కోట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిరి వల్లభనేని బాలశౌరి కుమారుడు వల్లభనేని అనుదీప్ మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డీకే బాలాజీకి రెండు సెట్ల నామినేషన్లను అందజేశారు. నామినేషన్‌లో దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం అనుదీప్ పేరుతో రూ.63.55 కోట్లు ఆస్తులు ఉన్నట్లుగా చూపారు. అనుదీప్‌కు ఆయన భార్యకు ఏ విధమైన బంగారు ఆభరణాలు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆస్తులకు సంబంధించి గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామంలో 2013లో 5.5 ఎకరాల భూమిని అప్పటి ధర ప్రకారం రూ.19,91,142 గా నమోదు చేశారు. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.14,64,10,000గా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీంతో పాటు మచిలీపట్నంలోని నాయర్ బడ్డీ సెంటరులోని 430 గజాల ఇల్లు 2023లో కొనుగోలు చేసినట్లు అప్పటి ధర ప్రకారం రూ.73.08 లక్షలుగా చూపారు. ప్రస్తుతం దీని మార్కెట్ విలువ రూ.85 లక్షలుగా పేర్కొన్నారు. దీంతో పాటుగా భార్యకు హైదరాబాద్ గచ్చిబౌలిలో 150 గజాల స్థలం ఉందని దీని విలువ రూ.40 లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే బ్యాంకులు తదితర సంస్థల్లో రూ.42 కోట్లు అప్పుగానూ, ప్రభుత్వ పన్ను, ఇతర బకాయిలుగా రూ.7.02 కోట్లు ఉన్నట్లు నామినేషన్ పత్రాలతో జతపరిచిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

నున్న చెక్‌పోస్టులో రూ.4.5 లక్షలు స్వాధీనం

నున్న(విజయవాడరూరల్): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి రూ.4.5 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నున్న గ్రామం పవర్‌గ్రిడ్ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాది జిల్లా దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామానికి చెందిన దంపకుంట్ల శ్రీనివాసరావు ఆర్టీసీ బస్సులో విజయవాడ వస్తున్నాడు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆయన వద్ద నగదు గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో నగదు సీజ్ చేసి ట్రెజరీకి పంపినట్లు నున్న రూరల్ సీఐ ఎన్.దుర్గాప్రసాద్ చెప్పారు.

26 నుంచి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సంఘం సమావేశాలు

ఘంటసాల: రాబోయే ఖరీఫ్, రబీ కాలంలో వివిధ పంటల సమస్యలు, చేపట్టాల్సిన పరిశోధనలపై ఈ నెల 26వ తేదీ నుంచి గుంటూరు లాంలో జరిగే వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాలను రైతులు విజయవంతం చేయాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలిపారు. ఘంటసాల కేవీకేలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ శ్రీలత మాట్లాడారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరులోని లాం ప్రాంగణంలో జరిగే సమావేశాల్లో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు చర్చిస్తారన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట):పండువెన్నెల.. మల్లెపూల పందిరిలో.. రంగు రంగుల విద్యుద్దీపాల నడుమ.. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను కొండపైన ఆలయం నుంచి ఊరేగింపుగా కొండ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగిరి రామకృష్ణమా చార్యులు, పరాంకుశం శ్రీనివాసాచార్యులు కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ లోకకళ్యాణార్థం ఏటా స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నూతక్కి సాంబశివరావు, విజయవాడ డీసీపీ శ్రీనివాసరావు, పలువురు దంపతులు పీఠలపై కూర్చున్నారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు వైఖానస ఆగమ శాస్త్రానుసారం వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణం చేశారు. గ్రామమంతా ఏడుకొండల నామస్మరణతో మార్మోగింది. వ్యాఖ్యాతగా వాసుదేవాచార్యులు వ్యవహరించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ రవి కిరణ్, సీఐ జానకీరామ్, పర్యవేక్షణలో జగ్గయ్యపేట, చిల్లకల్లు ఎస్ఐలు సతీష్, పద్మారావు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ విజయరాజు పాల్గొన్నారు. విప్ ఉదయభాను సతీమణి విమలాభాను కల్యాణోత్సవాన్ని సామాన్య భక్తులతో కలిసి వీక్షించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో పాలకవర్గ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు సామాన్య భక్తుల్లా కల్యాణం తిలకించారు.

టెన్త్‌లో మున్సిపల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నంటౌన్: పదో తరగతి ఫలితాల్లో మచిలీపట్నం నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఏడు ఉన్నత పాఠశాలల్లో 579 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 508 మంది ఉత్తీర్ణులై 87.70 శాతం సాధించారు. చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో 179 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 150 మంది ఉత్తీర్ణులై 84 శాతం సాధించారు. రుస్తుంబాద బాలికల హైస్కూల్ 96 మందికి 85 మంది ఉత్తీర్ణులై 89 శాతం, దేశాయిపేట హైస్కూల్‌లో 118 మందికి 105 ఉత్తీర్ణులై 89 శాతం, బందరుకోట హైస్కూల్‌లో 29 మందికి 27 ఉత్తీర్ణులై 93 శాతం, కాలేఖాన్‌పేట హైస్కూల్‌లో 65 మందికి 61 ఉత్తీర్ణులై 94 శాతం, గిలకలదిండి హైస్కూల్‌లో 35 మందికి 31 మంది ఉత్తీర్ణులై 89 శాతం, రుస్తుంబాద బాలుర ఉన్నత పాఠశాలలో 57 మందికి గానూ 49 మంది ఉత్తీర్ణులై 86 శాతం సాధించారు. కాలేఖాన్‌పేట హైస్కూల్ 94 శాతంతో ప్రథమ, బందరు కోట హైస్కూల్ 93 శాతంతో ద్వితీయ స్థానాలు సాధించాయి.



బచ్చుల శ్రీప్రకాష్



ఎం భావన



సిద్దినేని విశ్వశ్రీ

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు..

పదో తరగతి ఫలితాల్లో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తీర్ణత పెంచేందుకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయి. నగరపాలక సంస్థకు చెందిన చిలకలపూడి పాండురంగ ఉన్నతపాఠశాల విద్యార్థినులు దేవన బోయిన చరిష్మ రత్నమణి, వాలిశెట్టి బాల నాగలక్ష్మి 570 మార్కులు సాధించి నగరంలో ప్రథమస్థానాన్ని సాధించారు. బందరు కోట హైస్కూల్ విద్యార్థి బచ్చుల శ్రీప్రకాష్ 555 మార్కులు, కాలేఖాన్‌పేటకు హైస్కూల్ విద్యార్థిని ఎం.భావన 552 మార్కులు, రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సిద్దినేని విశ్వశ్రీ 565 మార్కులు, దేశాయిపేట హైస్కూల్ విద్యార్థి కె.జ్ఞానశ్రీకరణ్ 559 మార్కులు, రుస్తుంబాద బాలుర హైస్కూల్‌కు చెందిన పళ్లెం పార్థసారధి 528 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు అభినందించారు.

కార్తికేయుని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. వైఎస్సార్ సీపీ తరపున పెడన నియోజకవర్గానికి నామినేషన్ వేయనున్న ఉప్పాల రమేష్ (రాము) తమ బీ ఫారం నాగపుట్ట వద్ద, స్వామివారి పానిపట్టు సన్నిధినందు ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి కరుణ, కృప, దీవెనలతో మంచి మెజార్టీతో విజయం సాధించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జిల్లా పార్టీ కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, ఎంపీటీసీ సనకా వెంకటరాజేష్‌బాబు, గరికిపాటి బుల్లి శుభాకాంక్షలు అందచేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్ హారిక రాము దంపతులు

నేడు 91 అడుగుల బాబా విగ్రహావిష్కరణ



నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని శ్రీ అమ్ముల షిర్డీ సాయిబాబా సేవాశ్రమం ఆధ్వర్యంలో నిర్మించిన 91 అడుగుల సాయిబాబా విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకులు పూజ్య గురూజి అమ్ముల సాంబశివరావు చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ వేడుక నేపథ్యంలో మంగళవారం ఆశ్రమ నిర్వాహకులు, సాయి సేవకులు, భక్తుల ఆధ్వర్యంలో భారీ ఆధ్యాత్మిక ప్రదర్శనతో బాబా వారి గ్రామోత్సవం జరిగింది. ఈ గ్రామోత్సవం నంగేగడ్డ, మర్రిపాలెం మీదుగా నాగాయలంకలో కొనసాగింది.

గిరి ప్రదక్షిణతో నెరవేరుతున్న మనోభీష్టం



గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్న ఈవో రామారావు, ఆలయ అధికారులు



గిరి ప్రదక్షిణలో దుర్గా మల్లేశ్వరస్వామి వార్లు

వైభవంగా పౌర్ణమి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమి రోజున ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా తమ మనోభీష్టి నెరవేరుతుందని పలువురు భక్తులు తెలిపారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మంగళవారం తెల్లవారుజామున నిర్వహించారు. లోక కళ్యాణార్థం, భక్త జన శ్రేయస్సు, ధర్మ ప్రచారం నిమిత్తం ప్రతి నెలా పౌర్ణమి రోజున గిరి ప్రదక్షణ నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 05-55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఈవో కెఎస్.రామరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంబించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై దుర్గామల్లేశ్వరస్వామి వార్లు కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పు నృత్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పటల్, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరింది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనడం వల్ల తమ కోర్కెలు తీరుతున్నాయని భక్తులు పేర్కొన్నారని ఆలయ అర్చకులు తెలిపారు. గిరి ప్రదక్షిణలో భాగంగా తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన ఆది దంపతులకు భక్తులు పూలు, పండ్లు సమర్పించి పూజలు జరిపించుకున్నారు. ఈవో రామరావు దంపతులు, ఈఈ కోటేశ్వరరావు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, యజ్ఞనారాయణ మూర్తి, సూపరిండెంటెంట్లు భాగ్యజ్యోతి, సునీతలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఘరానా కేటుగాడు అరెస్టు

- కార్లు, స్థలాల పేరుతో రూ.92 లక్షలు స్వాహా
- భార్య అమెరికాకు పరార్
- తండ్రి హైకోర్టు నకిలీ లాయర్





రకరకాల వేషాలతో శరత్‌చంద్రవర్మ

పెనమలూరు: బ్లఫ్‌మాస్టర్ సినిమాలో కథానాయకుడిని మించిన కేటుగాడిని కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన అల్లూరి శరత్‌చంద్రవర్మ, ఆయన భార్య గుత్తా జ్యోత్స్నప్రియ, వర్మ తండ్రి అల్లూరి వెంకట సంజీవరాజు పోరంకి లక్ష్మీపురంకాలనీలో గత కొద్ది కాలంగా అద్దెకు ఉంటున్నారు. శరత్ చంద్రవర్మ ఢిల్లీ నుంచి సెకండ్ హ్యాండ్ కార్లు తీసుకొచ్చి తక్కువ ధరకు అమ్ముతామని, అలాగే విజయవాడ శివారు ప్రాంతాల్లో తక్కువ ధరకే స్థలాలు ఇప్పిస్తామని జనాలను మోసం చేయసాగాడు. ఇంటి ఎదురుగా ఉండే మేలురెడ్డి శ్రీనివాసరెడ్డి ఆర్థిక స్థితిని గమనించి ఆయనతో శరత్‌చంద్రవర్మ కుటుంబం పరిచయం పెంచుకుంది. ఇందులో భాగంగా శరత్‌చంద్రవర్మ, అతని భార్య గుత్తా జ్యోత్స్న తన 9 నెలల కుమారుడిని శ్రీనివాసరెడ్డి ఇంట్లో వదిలేసేవారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు పెరిగాయి. ఇది అవకాశంగా తీసుకొని నకిలీ పత్రాలతో కారు, నున్న వద్ద ఎకరం పొలం తక్కువ ధరకు వస్తుందని దంపతులు శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ, శరత్‌చంద్రవర్మ తండ్రి అల్లూరి వెంకట సంజీవరాజు పథకం ప్రకారం శ్రీనివాసరెడ్డిని నమ్మించి రూ.92 లక్షలు కొట్టేశారు. శ్రీనివాసరెడ్డికి కారుగానీ, స్థలం గానీ ఇవ్వక పోవటంతో అనుమానం వచ్చి పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఇది ముందుగానే పసిగట్టిన జ్యోత్స్నప్రియ అమెరికాకు పారిపోయింది. అల్లూరి శరత్‌చంద్రవర్మ, అల్లూరి వెంకటసంజీవరాజు కనిపించకుండా పోయారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా శరత్‌చంద్రవర్మను మంగళవారం తాడిగడప వద్ద అరెస్టు చేశారు. జ్యోత్స్నప్రియ గతంలో పెనమలూరుకు చెందిన తేలప్రోలు శ్రీనివాస్‌ను కూడా మోసం చేయగా కేసు విచారణలో ఉంది.

అప్రమత్తంగా ఉండాలి...

ఇటువంటి ఘరానా నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. తండ్రీకొడుకులు అల్లూరి శరత్‌చంద్రవర్మ, వెంకటసంజీవరాజు అమాయకులను మోసం చేసి రూ.కోట్లు నొక్కేశారని తెలిపారు. వీరిపై అనేక కేసులు ఉన్నాయన్నారు. వీరు వాడే వాహనాలపై హైకోర్టు జడ్జి, ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకోని జనాన్ని మోసం చేస్తున్నారని చెప్పారు. తండ్రి వెంకట సంజీవరాజు హైకోర్టు లాయర్ అని ప్రజలను మోసం చేస్తాడని పేర్కొన్నారు. ఇటువంటి వారి పట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

వివాహం కావడం లేదని యువకుడి బలవన్మరణం



గూడూరు:వివాహం కావడం లేదన్న మనస్థాపంతో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని రాయవరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పి.రమేష్ (33) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా తనకు వివాహం కావడం లేదని మనోవేదన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో జొన్నలరేవు నుంచి కంచాకోడూరు వెళ్లే రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మద్యంలో పందికొక్కుల మందు కలుపుకుని తాగినట్లు గుర్తించిన స్థానికులు రమేష్ సోదరుడు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు ఎస్ఐ ఐ.వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పెడనకు షర్మిల రాక

పెడన: కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు షర్మిల పెడనకు బుధవారం సాయంత్రం వస్తున్నారని ఆ పార్టీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి శొంఠి నాగరాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ షర్మిల బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పెడన బస్టాండు వద్ద పెడన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగాల సుధాకర్, నందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం షెడ్డు సీలింగ్ షీట్ల తొలగింపు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యన్నదానం షెడ్డు లోపల సీలింగ్ షీట్స్‌ను పూర్తిగా తొలగించినట్లు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వేసవి ఒత్తిడికి సీలింగ్ షీట్స్ కొన్ని కిందకు జారడంతో ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీస్ ఇచ్చామని, తాను సొంత ఖర్చులతో సీలింగ్ వేస్తామని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం లేకుండా త్వరిత గతిన సీలింగ్ నిర్మాణం చేపట్టి, భవిష్యత్‌లో ఇటువంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

నేడు రాము నామినేషన్

కృత్తివెన్ను: పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉప్పాల రమేష్ (రాము) బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని ఈ నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెడన తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నామినేషన్ వేయనున్నారన్నారు. పార్టీ శ్రేణులంతా వచ్చి ఉప్పాల రాముకు మద్దతు తెలపాలన్నారు.

ఘనంగా లంకమ్మ జాతర



అమ్మవారికి ఘటం బిందెలతో ప్రదర్శన చేస్తున్న భక్తులు

అవనిగడ్డ: దివిసీమ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న లంకమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవి సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రభలు కట్టుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో 20వేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, చింతలపూడి బాలుతో తదితరులు పర్యవేక్షించారు.

జిల్లాలో రూ.8.6 కోట్ల నగదు, మద్యం స్వాధీనం



బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

బంటుమిల్లి:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత నెల రోజులుగా జిల్లాలో పలు చోట్ల నిర్వహించిన సోదాల్లో రూ.8.6 కోట్లు నగదు, మద్యం తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రాత్రి బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను ఎస్ఐ వాసును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 2024 ఎన్నికలు కూడా ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి కావాల్సిన అన్ని చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కావాల్సిన పారామిలిటరీ సిబ్బంది అవసరమో గుర్తించి నివేదికలను ఎన్నికల సంఘానికి తెలియజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు నిర్వహించేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అనంతరం బంటుమిల్లి, అర్తమూరు గ్రామాల్లో ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాలు వద్ద ఏర్పాటు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈయనతో పాటు పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జి.వాసు ఉన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



ఘంటసాలలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

ఘంటసాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులు పది పరీక్షల్లో సత్తా చాటుతున్నారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. పది ఫలితాలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 568 మార్కులతో మండలస్థాయిలో మొదటిస్థానం సాధించిన ఘంటసాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కేతన జ్యోత్స్నతో పాటు డి.నాగజ్యోతిర్మయి, చరణ్‌తేజ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో నేతలు మేరుగు వేణుగోపాలరావు, చింతల శ్రీనివాసరావు, పి.గోవర్ధనరావు, మేరుగు ప్రశాంతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఒర్లగొందితిప్ప ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగవిరమణ చేసిన మనోహర్ కమలానంద్‌ను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాద్ మనోహర్ దంపతులను దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులు ఆదినారాయణ, శివరామకృష్ణ, ప్రసాద్, గోపీనాథ్, అశ్విని, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థినులకు బహుమతులు అందించిన ప్రిన్సిపాల్ కేబీఎస్ శర్మ

పురిటిగడ్డ(చల్లపల్లి): పేద కుటుంబాల విద్యార్థులు ప్రతిభావంతులై ఉజ్వల భవిష్యత్తు పొందాలని పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ కేబీఎస్ శర్మ ఆకాంక్షించారు. స్థానిక పాఠశాల ఆవరణలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియెట్ బైపీసీ ఇంగ్లిష్ మీడియం, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులకు దాతల సహకారంతో ఆర్థిక ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేశారు. దాతలు నాదెళ్ల నరసయ్య, నాదెళ్ల గోపీచంద్, మాలెంపాటి రంగారావు, అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం

చల్లపల్లి నారాయణరావు నగర్‌లోని ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, హెచ్‌ఎం కైతేపల్లి దాస్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ సభకు ఎంఈఓ-2 పీ.వెంకటేశ్వరరావు విచ్చేసి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

క్లుప్తంగా

నామినేషన్‌కు తరలి రావాలని కరపత్రాల పంపిణీ



పెడన: పెడన నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) బుధవారం ఉదయం నామినేషన్ వేస్తున్నారు..ఈ శుభకార్యక్రమానికి మీరంతా వచ్చి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు గడప గడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డుల వారిగానే కాకుండా ప్రతి గ్రామంలో కూడా వైఎస్సార్ సీపీకి చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కరపత్రాలను అందజేశారు. బుధవారం ఉదయం పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీగా బయల్దేరి పెడన బంటుమిల్లి రోడ్డులోని ఈఆర్వో కార్యాలయానికి చేరుకుందామని కరపత్రంలో పేర్కొనడమే కాకుండా స్వయంగా ఆహ్వానం పలికారు.

ఘనంగా ఫ్రీ స్కూలు వార్షికోత్సవం



పెడన: మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో ఫ్రీస్కూలు (అంగన్‌వాడీ కేంద్రం) వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పద్యాలు పాడుతూ, ఆంగ్లపదాలు చెబుతూ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలభారతి, వాణిశ్రీ, రంగనాయకమ్మ, అనురాధ, అరుణలతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు, గర్భవతులు పాల్గొన్నారు.

27 మంది వలంటీర్ల రాజీనామా



కోడూరు: టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న విమర్శల నేపథ్యంలో 27మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. మండలంలోని వి.కొత్తపాలెం సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లందరూ మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. 27 మంది తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలకు అందించారు. ప్రజలకు సేవ చేస్తున్న తమపై టీడీపీ, జనసేన నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు మానసికంగా ఇబ్బంది కలిగించడంతో రాజీనామాలు చేసినట్లు వలంటీర్లు తెలిపారు. వారి రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయానికి పంపనున్నట్లు కార్యదర్శి ఏడుకొండలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన నేత



లక్ష్మీపురం(చల్లపల్లి): రైతాంగ సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం లక్ష్మీపురం శివారు నూకలవారిపాలెం గ్రామానికి చెందిన రైతు ప్రముఖులు, జనసేన అవనిగడ్డ నియోజకవర్గ ముఖ్య నాయకులు నూకల లక్ష్మయ్య వైఎస్సార్ సీపీలో చేరారు. నూకల లక్ష్మయ్య ఇంటి వద్ద =రమేష్ బాబు ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, కడవకొల్లు చైతన్య, పార్టీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని), వేములమడ సతీష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నెల సంబరం



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ నెల సంబరానికి భక్తజనం పోటెత్తారు. అమ్మవారి ప్రధాన జాతర ముగిసి నెల రోజులు పూర్తికావడంతో మంగళవారం అమ్మవారి నెలసంబరాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరణ చేశారు. ఆలయ ఈఓ సీహెచ్ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోలాహలంగా కిట్టు నామినేషన్

- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఓడ, మెడికల్ కళాశాల శకటాల ప్రదర్శన
- గజమాలలు వేసిన అభిమానులు
- ట్రాఫిక్‌ను నియంత్రించిన ఎమ్మెల్యే పేర్నినాని



నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నియోజకవర్గం నడుబొడ్డున వైఎస్సార్ సీపీ జెండాలు మంగళవారం రెపరెపలాడాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల దార్లు ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నామినేషన్ ఘట్టం వైపే సాగాయి. పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చాయి. కోనేరు సెంటర్ అన్ని రహదారులూ కిటకిటలాడాయి. మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న శ్రీ విజయ గణపతి ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిఆలయం, పెదకరగ్రహారంలోని ఫరీద్‌బాబా దర్గాను దర్శించుకున్నారు. సుల్తానగర్‌లోని ఆంజనేయగుడి స్వామిలో పూజలు చేయించుకున్నారు. నామినేషన్‌కు బయలుదేరిన పేర్ని కిట్టు వెంట పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు మేము సైతం అంటూ ముందుకు సాగారు.

● ఓడ, మెడికల్ కళాశాల శకటాల ప్రదర్శన

పేర్ని కిట్టు నామినేషన్ ర్యాలీలో ఓడ, మెడికల్ కళాశాలల నమూనాలతో తయారు చేసిన శకటాలను ప్రదర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పాలనలో మునుపెన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే పేర్నినాని కృషితో నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందింది. బందరు పోర్టు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటును ప్రజలకు వివరించేలా నామినేషన్ ర్యాలీలో ఈ శకటాలను ప్రదర్శించారు.

● విచిత్రవేషధారణలు, వాయిద్యాలు, డీజే సౌండ్స్..

పేర్నికిట్టు నామినేషన్ ర్యాలీలో ముందు భాగాన కళాకారుల విచిత్ర వేషధారణల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. సంప్రదాయ డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ సిస్టమ్స్‌లో పాటలకు కార్యకర్తలు కదంతొక్కుతూ, డ్యాన్స్‌లు వేస్తూ ముందుకు సాగారు.

● గజమాలలు వేసిన అభిమానులు..

నామినేషన్ వేసేందుకు ప్రత్యేక వాహనంలో ముందుకు సాగుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పేర్నికిట్టుకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పలు కూడళ్ల వద్ద గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలాద్‌దాదా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు తదితర నాయకులు ప్రత్యేక వాహనంపై ఆశీనులై కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేశారు.

● అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు..

నామినేషన్ ర్యాలీలో ఉన్న పేర్నికిట్టు, నాయకులు లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు

● ట్రాఫిక్‌ను నియంత్రించిన ఎమ్మెల్యే పేర్నినాని

పేర్నికిట్టు నామినేషన్ రాలీలో భారీగా ఆటోలు, ద్విచక్ర వాహనాలుఉండటంతో ట్రాఫిక్‌ను ఎమ్మెల్యే పేర్ని నాని క్రమబద్ధీకరించారు. ర్యాలీ పాల్గొన్న పార్టీ శ్రేణులకు పేర్నినాని అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు.

ఆకట్టుకున్న బైక్ ర్యాలీ



పోతేపల్లి నుంచి బైక్ ర్యాలీతో కిట్టు నామినేషన్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ బందరు శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నామినేషన్ కు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంగళవారం జరిగిన నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని 34 పంచాయతీలకు చెందిన గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. గ్రామాల నుంచి ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కారులలో కార్యకర్తలు ర్యాలీగా బందరుకు చేరుకున్నారు. బందరు ఎమ్మెల్యే పేర్ని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టులకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జై జగన్. జై జై జగన్.. వర్థిల్లాలి పేర్ని నాని, పేర్ని కిట్టుల నాయకత్వం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ ర్యాలీలు నిర్వహించారు. పలు గ్రామాల్లో తీన్మార్ డప్పులు, డీజేలకు యువకులు ఉప్పొంగిన ఉత్సాహంతో చిందులు వేశారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండండి



ఇతర పోలింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన: పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన పనిని బాధ్యతగా నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ అన్నారు. నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరుకాని ఇతర పోలింగ్ అధికారులకు, సిబ్బందికి పోలింగ్ విధులపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వెంకటరమణ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించడానికి ప్రొసిడింగ్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారులకు ఇతర పోలింగ్ సిబ్బందిని ఐదుగురిని కేటాయిస్తామన్నారు. పీవోలు, ఏపీవోలు అప్పగించిన పనిని ఇతర పోలింగ్ సిబ్బంది నిర్వహించాలని పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రికి సంబంధించి అన్ని సక్రమంగా ఉన్నాయా లేవా, అన్ని అందాయా లేదా చూసుకోవాలన్నారు. పీవోలు, ఏపీవోలతో కలిసి పనిచేయాలని, ఏ తప్పు జరిగినా తక్షణమే పీవోల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పోలింగ్ సామగ్రితో పాటు పోలింగ్ స్టేషన్‌కు తరలి వెళ్లాలని, అక్కడే స్టే చేయాల్సి ఉంటుందన్నారు. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు విందు, బస ఏర్పాటు చేస్తామన్నా వాటి జోలికి పోవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం మాకు దగ్గరగానే ఉంటుందని, మా బంధువులు ఇంటికి కొంచెం దూరమేననే విషయాలను కూడా మదిలోకి రానీయొద్దని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ రోజు ఉదయమే మాక్ పోల్ ఉంటుందని, మాక్ పోల్ పూర్తయిన తరువాత ఈపీవోలు, ఏపీవోలు బ్యాలెట్ యూనిట్‌ను క్లియర్ చేయాలని, ఆ విధంగా చేశారో లేదో చేయకపోతే వారి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. అందరూ కలిసి పోలింగ్‌ను దిగ్విజయంగా పూర్తి చేయడానికి సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో కె.రాంబాబు, డెప్యూటీ తహసీల్దారు పూర్ణచంద్రరావు, ఎన్నికల విభాగం డీటీ కల్పన ఓపీవోలు (అదర్ పోలింగ్ అధికారులు) పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన ఆణిముత్యాలకు సత్కారం



నాగాసాహితి, ఆమె తల్లిదండ్రులను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం పెద్దలు

నాగాయలంక: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని అన్ని పాఠశాలల స్థాయిలో అగ్రగామిగా నిలిచి 591మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకున్న బాలిక మామిడి నాగసాహితిని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆమెతో పాటు తల్లిదండ్రులు మామిడి రాజగోపాల్, అనురాధలను శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. చదువులో తీర్చిదిద్దిన విద్యాభారతి పబ్లిక్ స్కూలు అధినేతలు ఆకుల వెంకట రత్నారావు, ఏవీ శేషుబాబు, ఉపాధ్యాయులను, విద్యార్థిని నాగసాహితి కృషిని సంఘం నాయకులు ప్రశంసించారు. తాడికొండ సత్యనారాయణ, చిట్టా బాలపాపారావు, ఆకుతోట సుధీర్, జల్లూరి మురళీధర్, చిట్టా వెంకట శేఖర్, సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

గూడూరు: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు నందం రవికిరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపట్ల చూపుతున్న ప్రాధాన్యత కారణంగానే తమ పాఠశాలలో నూరుశాతం ఫలితాలు సాధించడానికి తోడ్పడ్డాయని వివరించారు. ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేసి రానున్న కాలంలో ఇదే పరంపర కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సింహాద్రి నామినేషన్



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థిగా సింహాద్రి రమేష్‌బాబు బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆరు మండలాల నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే నామినేషన్ పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నామినేషన్ కేంద్రం వరకూ ప్రదర్శనగా రానున్నారు. పెద్ద ఎత్తున నేతలు, అభిమానులు తరలిరావాలని కోరుతూ ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మాజీ సర్పంచ్‌లు నలుకుర్తి పృధ్వీరాజ్, దాసి జీవరత్నం ఆరు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు

పెడనలో ఎనిమిదికి చేరిన నామినేషన్లు



ఈఆర్వో వెంకటరమణకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రేవతీదేవి

పెడన: పెడన నియోజకవర్గంలో పోటీ చేసేందుకు దాఖలైన నామినేషన్ల సంఖ్య మంగళవారంతో ఎనిమిదికి చేరింది. మంగళవారం బంటుమిల్లికి చెందిన సబ్బిశెట్టి రేవతీదేవి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణకు అందజేశారు. పెడన నియోజకవర్గంలో ఇప్పటి వరకు 8 మంది నామినేషన్లను సమర్పించారని ఈఆర్వో వెంకటరమణ తెలిపారు.

జగనన్నతోనే సామాజిక సాధికారత

గౌడ సంఘం కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ



గౌడ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణ

మోపిదేవి: సామాజిక సాధికారత జగనన్నతోనే సాధ్యమని గౌడ సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఎం.శివరామకృష్ణ తెలిపారు. వైఎస్సార్ సీపీ కోడూరు మండల పార్టీ కన్వీనర్ పరిశే మాధవరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి గౌడ సంఘ ఆత్మీయ సమావేశం మోపిదేవి ఎస్ విహార్‌లో సోమవారం రాత్రి జరిగింది. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయంలో బీసీలను ముఖ్యంగా గౌడలను కేవలం తమ ఓటు బ్యాంకుగానే పరిగణించి గీత కార్మికులకు కుండ, సైకిల్ వంటి పనిముట్లు అందించి చిన్న చూపు చూశారని ఆవేదన చెందారు. వైఎస్సార్ వచ్చిన నాటి నుంచే కల్లు గీత కార్మికులకు సరైన గౌరవం లభించి తొలిసారిగా పింఛన్ అందించిన ఘనత ఆయనకే చెల్లిందన్నారు. జగనన్న సీఎం అయ్యాక గౌడ కుటుంబాలు రూ. 5.87 లక్షలు లబ్ధిపొందారని గుర్తుచేశారు. వివిధ కార్పొరేషన్లలో చైర్మన్ నుంచి డైరెక్టర్ స్థాయి వరకు పదవుల్లో గౌడ సామాజిక వర్గం 90 వేల మందికి పైగా పదవులు అనుభవిస్తున్నారని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా జనరల్ కేటగిరీ అయినా ఉప్పాల హారికకు ఆ చైర్మన్ పదవి హోదా కల్పించిన ఘనత జగనన్నదన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ గౌడ వర్గాలకు అసెంబ్లీకి 4, ఎంపీకి 2 సీట్లు ఇచ్చి గౌరవించారని వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగనన్నకు సంపూర్ణ మద్దతు పలికి అవనిగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం పార్లమెంట్‌కు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరావును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు, కృష్ణా, గుంటూరు జిల్లా జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేతలు వికాస్ బాబు, చైతన్యబాబు, చెన్ను రంగారావు, మదన్‌మోహన్ తదితరులు మాట్లాడారు. జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, చల్లపల్లి మండల బీసీ కన్వీనర్ ఎం ప్రకాష్, పెద్ద ఎత్తున నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని హోమం చేస్తున్న వేదపండితులు

గూడూరు: శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో రాయవరంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో అయ్యప్ప స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల శిఖర జీవ యంత్ర సహిత నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు గ్రామస్థులు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం గణపతి హోమం, బింబశుద్ధి క్రియ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 8.11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కలశాభిషేకం, పూర్ణాహుతి, మహానైవేద్యం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆశ్రమంలో వృద్ధురాలు మృతి

చల్లపల్లి: ఈ నెల 17వ తేదీ చల్లపల్లి ప్రధాన కూడలిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని స్థానికులు వృద్ధాశ్రమంలో చేర్చగా మంగళవారం మృతి చెందింది. తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఈ నెల 17వ తేదీ చల్లపల్లి సెంటరుకు వచ్చిన గుర్తు తెలియని ఒంటరి వృద్ధురాలి కోసం రాత్రి అయినా ఎవరూ రాకపోవటంతో దుకాణదారులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలిని స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో చేర్చారు. కాగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి గత ఆరు రోజులుగా ఆశ్రమ నిర్వాహకులు భాస్కరరావు దంపతులు సపర్యలు చేశారు. ఆమె వివరాలు తెలుసుకునేందుకు ఆమె వద్ద ఉన్న పుస్తకంలో నంబర్ల ద్వారా ప్రయత్నం చేశారు. వృద్ధురాలి కోసం ఎవరూ రాలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వృద్ధురాలు తుది శ్వాస విడిచింది. దీంతో పుస్తకంలోని నంబర్లకు మరోసారి ఫోన్ చేసి పరిస్థితి వివరించగా, రేపల్లె శివారు సోడాయపాలెంకు చెందిన ఆమె బంధువులు స్పందించారు. చల్లపల్లి చేరుకుని వృద్ధురాలి మృతదేహం పరిశీలించి ఆమె పేరు వరలక్ష్మి అని, భర్త, పిల్లలు లేరని తెలిపారు. ఆమె స్వగ్రామం ఘంటసాల మండలం శ్రీకాకుళం అని తెలిపారు. దీంతో వృద్ధురాలి మృతదేహాన్ని ఆశ్రమ నిర్వాహకులు బంధువులకు అప్పగించారు.